
తల్లికి వందనం.. అందరికీ అందేనా?



స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి మేనిఫెస్టో ఇదే..

కూటమి ప్రభుత్వం హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకం ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో తల్లులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో అందరిలో గందరగోళం నెలకొంది. ఎంతమంది పిల్లలను పంపిస్తే అంతమందికి కూడా ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం, పిల్లల సంఖ్య, ఇతర అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

ఎంతో ఆశ పడ్డాను..



మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి 4వ తరగతి, చిన్నబ్బాయి 2వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా ప్రతీ ఏడాది రూ.14 వేల చొప్పున ఇచ్చారు. ఈ ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో ఎంతమంది ఉన్నా అంతమందికి రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. రూ.30వేలు వస్తాయని ఆశపడ్డాను. పిల్లల చదువుకు ఫీజులు చెల్లించవచ్చునని అనుకున్నాను. ఇప్పుడేమో ఒకరి మాత్రమే ఇస్తారని అంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– కిలారి రోజా, యంబరాం, హిరమండలం

ఆనందం ఆవిరి..



తల్లికి వందనం ద్వారా చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడంతో ఎంతో ఆనందించాం. నాకు ఇద్దరు పిల్లలు. ఐదు, ఏడువ తరగతి చదువుతున్నారు. ఇప్పుడు ఒకరికి మాత్రమే తల్లికి వందనం ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించడం బాధాకరం.

– గేదెల రూప, ఎనోకేపురం, కొత్తూరు మండలం

మాట నిలబెట్టుకోవాలి



నాకు ఇద్దరు అబ్బాయిలు. ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాను. మూడు, ఒకటో తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం అందించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఒక్కరికే ఇస్తామంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– మర్రి శ్రీలత, చిట్టివలస కాలనీ, ఆమదాలవలస మండలం

ఇద్దరి పిల్లలకు వస్తుందని ఎదురు చుస్తున్నాం



మాకు ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. రూ.30 వేలు వస్తుందని ఎదురుచూస్తున్నాం. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కరికే అంటున్నారు. ఇది చాలా అన్యాయం.

– దేవి పట్నాయక్, నీలమణిదుర్గ కాలనీ, పాతపట్నం

ఒకరికే ఇస్తామనడం సరికాదు



బడులు పెట్టి నెల రోజులు అయింది. తల్లికి వందనం డబ్బులు అందలేదు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరు పిల్లలు రెండో తరగతి చదువుతున్నారు. ఎన్నికల ముందు ఎందరు పిల్లలు ఉన్నా.. అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు చెల్లిస్తామని చెప్పారు. నేడు ఒకరికి తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తామని చెప్పడం సరికాదు.

– మఠం త్రివేణి, ఎనోకేపురం, కొత్తూరు మండలం

మోసం చేయడం సరికాదు..



తల్లికి వందనం పేరుతో తల్లులకు కూటమి ప్రభుత్వం మోసం చేయడం సరికాదు. ఎన్నికల ముందు తల్లికి వందనం కింద రూ.15 వేలు చెల్లిస్తామని చెప్పారు. నా ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. ఒక్కరికి మాత్రమే తల్లికి వందనం ఇస్తామని చెప్పడం మోసం చేయడమే.

– చింతాడ లక్ష్మి, గులివిందలపేట, కొత్తూరు మండలం

అందరికీ వర్తించేలా చూడాలి



నాకు ఇద్దరు అబ్బాయిలు. 8, 6వ తరగతి చువుతున్నారు. ఇంటిలో ఎంతమంది ఉన్నా అందరకీ తల్లికి వందనం పేరిట రూ.15వేలు ఇస్తామని అనడంతో ఎంతో ఆనంద పడ్డాం. ఇప్పుడేమో ఇంటిలో ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందంటూ జీఓ విడుదల చేశారని చెబుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

– గులివెందుల లలిత, తంప గ్రామం, హిరమండలం మండలం

అధిక జనాభాతో సమస్యలు


నరసన్నపేట: నినాదాలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, స్థానికులు

నరసన్నపేట: అధిక జనాభాతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ప్రతిఒక్కరూ జనాభా నియంత్రణకు సహకరించాలని ఉర్లాం పీహెచ్‌సీ హెచ్‌డబ్ల్యూఓ తిరుపతిరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉర్లాం పీహెచ్‌సీ ఆవరణలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనాభా నియంత్రణ పద్ధతులను వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

సారవకోట: ప్రపంచ జనాభా దినోత్సవంపై బొంతు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బొంతు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరగడం వల్ల కలిగే ఆర్థిక, సామాజిక ఇబ్బందులను వివరించారు. అవలింగి జీబీటీ పాఠశాల ఆవరణలో పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగవల్లిక ద్వారా అవగాహన కల్పించారు.

ఎల్.ఎన్.పేట: జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యలపైన ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని లైన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల, కేజీబీవీలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. జనాభా కారణంగా కలిగే సమస్యలు, నష్టాలను విద్యార్థులకు అవగాహన కలిగించారు. కేజీబీవీ ఎస్‌ఓ అంబిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు తొగరాం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరావు, ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్.స్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే రవికుమార్‌ను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

ఆమదాలవలస: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు ఆధ్వర్యంలో పెన్షనర్ల సంఘం నాయకులు, సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఆమదాలవలస: పలు శాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సుడా, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ అధికారులు ఐదేళ్లలో చేపట్టిన పనులు నిధుల రాబడులు, చెల్లింపులపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఖాతాలో ఉన్న జనరల్ నిధులు ఎంత ఉన్నాయని ప్రశ్నించగా.. రూ.19.5 లక్షలు మాత్రమే ఉన్నట్లు అకౌంటెంట్ సాయిరాం తెలపడంతో అసహనం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలపాలని కోరగా 2023 – 2024లో రూ.3.67 కోట్లు రాబడి వస్తే రూ.ఐదు కోట్ల బిల్లులు ఎలా చేశారని, మిగిలిన రూ.1.33 కోట్ల లోటు మాట ఏమిటని మండిపడ్డారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు కూడా పరిష్కరించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.6 కోట్ల మున్సిపల్ నిధులు ఉండగా.. 2019 ముందు పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లించకుండా.. కొత్తగా పనులు ఎలా చేయించారని ప్రశ్నించారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఉపయోగం లేని పనులను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ జి.రవి, పబ్లిక్ హెల్త్ ఈఈ పాగిరి సుగుణాకర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మురుగునీరు తొలగించారు


పాఠశాల ప్రహరీకి అనుకొని మట్టివేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

నరసన్నపేట: మండలంలోని ముషిడిగట్టు పాఠశాల వద్ద మురుగునీరు ఎట్టకేలకు తొలగించారు. 'పాఠశాల చెంతనే మురుగు నీరు' శీర్షికన గురువారం సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీఓ రామకృష్ణ వెంటనే స్పందించారు. పంచాయతీ కార్యదర్శి జావెద్‌కు ఆదేశాలు జారీ చేసి, ఉదయం విద్యార్థులు స్కూల్‌కు వచ్చే సరికే మురుగునీటిని తొలగించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు కూడా సహకరించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సత్యం, కైలాసం త్యాగాలు మరువలేనివి


మాట్లాడుతున్న నీలంరాజు

నరసన్నపేట: శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో అశువులు బాసిన వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం త్యాగాలు మరువ లేనివని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నేతింటి నీలం రాజు అన్నారు. కోమర్తిలో సత్యం, కైలాసంల వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం రాజు మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటాల ఫలితమే జిల్లా అభివృద్ధి అని అన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుని పీడిత ప్రజలకు అండగా ఉంటామన్నారు. అలాగే అమరులు మామిడి అప్పలసూరి, గంటి ప్రసాదం త్యాగాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం


కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: వినియోగదారుల సౌకర్యార్థం కందిపప్పు, సన్న బియ్యం రాయితీపై ప్రభుత్వం విక్రయిస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేటలో గురువారం రాయితీపై కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్‌డ్ రైస్ 25 కేజీలు రూ.1,274లకు అందించారు. తహసీల్దార్ కనకారావు, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ, టీడీపీ నాయకులు శిమ్మ చంద్ర, గొద్దుచిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవస: ప్రజలకు అందుబాటులో నిత్యవసర సరుకుల ఉంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని రైతు బజార్ వద్ద పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీపై కందిపప్పు కౌంటర్‌ను గురువారం ప్రారంభించారు. రైతు బజారులో కిలో కందిపప్పు రూ. 160 విక్రయించడం జరుగుతుందన్నారు. డీఎస్‌ఓ శాంతి, తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, పౌర సరఫరాల శాఖ డీటీ దువ్వాడ అమర్నాథ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దలక్ష్మీపురంలో హోమియో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు ఉమాగౌరి

పాతపట్నం: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో సర్పంచ్ అన్నెపు సుజాత ఆధ్వర్యంలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యురాలు ఎస్.ఉమాగౌరి 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు మాట్లాడుతూ వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎ.ఉమామహేష్, సెక్రటరీ వాసు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

సరుబుజ్జిలి: గోనెపాడు హైస్కూల్ నుంచి 2023లో పదో తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు గురువారం నగదు బహుమతి అందించారు. మొదటి బహుమతి కింద గొండు సిరికి రూ.5 వేలు, 2వ బహుమతి సింగుపురపు పవన్‌కు రూ.4వేలు, 3ం బహుమతి బగాది సుమంత్‌కు రూ.3 వేలు, 4వ బహుమతి పేడాడ శైలజకు రూ.2 వేలను బిర్లంగి నాగేశ్వరరావు అందజేశారు. పూర్వ విద్యార్థులు మామిడి రాజేశ్వరరావు, బిర్లంగి కృష్ణమూర్తి, కూర్మాపు చిరంజీవి, సింగుపురపు రాజశేఖర్, గొండు వరహానర్సింహులు, శంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల కేజీబీవీ విద్యార్థులకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించినట్లు లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ సునీత తెలిపారు. విద్యార్థుల్లో హెచ్‌బీ శాతం ఎంత ఉందో ముందుగా గుర్తించటం జరుగుతుందన్నారు. రక్త హీనత ఉండే వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందన్నారు. ఎంత రక్తం ఉండాలి, రక్తంలో హెచ్‌బీ శాతం పెంచుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. డాక్టర్లు ప్రియాంక, లక్ష్మీదీప్, కేజీబీవీ ఎస్‌ఓ అంబిక, హెల్త్ సూపర్‌వైజర్ జనార్ధనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో కొత్తూరు సీహెచ్‌సీ కిటకిట


కొత్తూరు సీహెచ్‌సీలో రోగులతో నిండిపోయిన మంచాలు

కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీ రోగులతో కిటకిటలాడుతోంది. రోగులకు మంచాలు చాలకపోవడంతో పలువురు అవస్థలు పడుతున్నారు. గురువారం ఇన్‌పేషెంట్‌లతో సీహెచ్‌సీ నిండిపోయింది. ప్రధానంగా వసప, కొత్తూరు, ఉమ్మడి జిల్లా భామిని మండలం దిమ్మిడిజోల సీతంపేట మండలంలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన వ్యక్తులు డయేరియా, వైరల్ ఫీవర్లతో సీహెచ్‌సీలో చేరారు. దీంతో మంచాలు చాలక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బందిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించడంతో వారికి సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్‌తో పాటు ఇతర వైద్యులు, సిబ్బంది వైద్యం అందిస్తున్నారు.

ఘనంగా నీలమ్మతల్లి వారాలు


నీలమ్మ తల్లికి మొక్కులు తీర్చుతున్న గ్రామస్తులు


ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు, భక్తులు

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామంలో నీలమ్మ తల్లి వారాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతకు పసుపు, కుంకుమ, సమర్పించి ముర్రాటలతో చల్లదనం చేశారు. గ్రామస్తులు సుఖసంతోషాలుతో ఉండాలని ప్రార్థించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం వల్ల ఎక్కువగా వస్తున్న సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు స్టాప్ డయేరియా, డెంగీ, మలేరియా కార్యక్రమాలను చేపట్టినట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు వివరించారు. మండలంలోని బొబ్బిలిపేట పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రదేశాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను గురువారం పరిశీలించారు. మురుగు కాలువలు, పెంట కుప్పల నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి పూర్ణిమకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జమ్ము, జమ్ము కూడలి, తామరాపల్లిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాను ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

మెళియాపుట్టి మండలంలో..

మెళియాపుట్టి: మండలంలోని చాపర రూరల్ ఫీడర్ 33 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడనున్నట్లు టెక్కలి ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. చీపురుపల్లి, పట్టుపురం, హీరాపురం, శేఖరాపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



జలుమూరు: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, సిబ్బంది


బూడిత జోత్స్న (పాతపట్నం)


అనిల్ కుమార్ (పాతపట్నం)


పి.ప్రశాంత్ (పాతపట్నం)


మొయ్యి జ్యోత్స్న (నరసన్నపేట)


పల్ల శిరీష (నరసన్నపేట)


పి.మెర్సీ (నరసన్నపేట)


జి.మధుసూదనరావు (నరసన్నపేట)


జి.దివ్య (నరసన్నపేట)


మాసవరపు మధుశ్రీ (సారవకోట)


కురమాన దీపిక (సారవకోట)


జి.ఉదయ్‌కుమార్ (హిరమండలం)


బి.మణి (హిరమండలం)


కె.ఉమాదేవి (హిరమండలం)


వి.శ్రావ్య (హిరమండలం)


బూర గౌరీశంకర్ (పొందూరు)


సీపాన దీపిక (పొందూరు)


కూన రేవతి (పొందూరు)


మెట్ట లక్ష్మి (పొందూరు)

జలుమూరు: ట్రిపుల్ ఐటీకి కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికయ్యారు. చింతు సంజన, జి.గీతిక, వాన ఢిల్లేశ్వరరావు, బి.షర్మిల, టి.తేజశ్వని, జి.సుష్మ, జి.తరుణ్, వి.శైలజ, బి.వి.కుమారిని ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ గురువారం అభినందించారు. సర్పంచ్ నేతాజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం, బాడాం, నరసన్నపేట జిల్లా పరిషత్ (బోర్డు) ఉన్నత పాఠశాలలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఉర్లాం స్కూల్ నుంచి భూపతిరాజు, కోరాడ భవాని, దాసరి యశ్మిత, నరసన్నపేట బోర్డు స్కూల్ నుంచి పి.మెర్సీ, జి.మధుసూదనరావు, జి.దివ్య, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పల్ల శిరీష, బాడాం స్కూల్ నుంచి మొయ్యి జ్యోత్స్న ఎంపికయ్యారు.

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన మాసవరపు మధుశ్రీ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని హెచ్‌ఎం మాధవరావు తెలిపారు. విద్యార్థిని పాఠశాల సిబ్బందితోపాటు జేబీటీ పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ అభినందనలు తెలిపారు. చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కురమాన దీపిక ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు.

హిరమండలం: మండలంలోని నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ కె.రాంబాబు గురువారం తెలిపారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గొల్లంగి ఉదయ్‌కుమార్, బత్తుల మణి ఎంపికయ్యారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి కురమాన ఉమాదేవి, వంజరావు శ్రావ్య ఎంపికయ్యారు. వీరికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

మెళియాపుట్టి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొసమాల జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో వారందరినీ ఎంఈఓలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని హెచ్‌ఎం సనపల వైకుంఠరావు తెలిపారు. బూడిత జోత్స్న, అనిల్ కుమార్, పి.ప్రశాంత్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పొందూరు: ప్రభుత్వం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ జాబితాలో తాడివలస పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు చోటు లభించింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా ఎంపికయ్యారు. సీపాన దీపిక, కూన రేవతి శ్రీకాకుళం, మెట్ట లక్ష్మి, బూర గౌరీశంకర్, మెట్ట రాజశేఖర్ ఒంగోలుకుఎంపికైనట్లు హెచ్‌ఎం బల్ల కంటయ్య తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల తమ్మినేని మనెమ్మ, ఎంపీటీసీ సువ్వారి దివ్య, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పశువులకు టీకాలు

ఎల్.ఎన్.పేట: కొమ్మువలస గ్రామంలో పాడి పశువులకు గురువారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పాడి పశువుల్లో వచ్చే వ్యాధులను గుర్తించి వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యల కోసం గ్రామ సచివాలయ పశువైద్య సిబ్బంది రైతులకు అవగాహన కలిగించారు. పశువుల్లో ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.